

వైద్య సేవలు పెరగాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వైద్య సేవలు పెరగాల్సిన అవసరం ఉందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. డాక్టర్ తోట కార్తీక్, డాక్టర్ తోట అశ్విని సౌందర్య ఏర్పాటు చేసిన అశ్విని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలను ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, మాజీ మంత్రి కనుమూరు బాపిరాజు తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఎఎంసి ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు దక్కని 'సుఖీభవ'..!

రెండు జిల్లాల్లో లక్షా 62 వేల కౌలు కార్డుల జారీ లక్ష్యం

ఇప్పటికీ పూర్తికాని లక్ష్యం.. ఇక పెట్టుబడి సాయం అందేదెన్నడో

సాగు చేయని భూయలజమానులకు సొమ్ములు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం సాగు చేసే కౌలు రైతులకు ప్రభుత్వం ఎప్పటికి ఇస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. సాగు చేయని భూయజమానులకు ముందుగా అన్నదాత సుఖీభవ సొమ్మును జమ చేయడం కౌలు రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ శాఖ సాగులో 80 శాతం కౌలు రైతులే చేస్తున్నారు. వరి, పొగాకు, పామాయిల్, మిర్చి ఇలా అనేక పంటలను కౌలురైతులు సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు గతంలో ప్రభుత్వమే నిర్ధారించింది. ఆ లెక్కలను పక్కనబెట్టి ఇప్పుడు పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేలు, ఏలూరు జిల్లాలో 75 వేల మందికి కౌలుకార్డులు జారీ చేయాలని ప్రభుత్వం టార్గెట్ విధించింది. ఇప్పటికీ ఆ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఏడాదికి రూ.20 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని తెలిపింది. అందులో భాగంగా కేంద్రం పిఎం కిసాన్ సమాన్ నిధి కింద ఇచ్చే రూ.ఆరు వేలు కాకుండా, మిగిలిన రూ.14 వేలు మూడు విడతలవారీగా కేంద్రం విడుదల చేసిన సమయంలో ఇస్తామని చెప్పింది. అందులో భాగంగా ఈ నెల రెండో తేదీన అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం సొమ్ము మొదటి విడత రూ.5 వేలు జమ చేసింది. జమ చేసిన రైతుల్లో ఒక్క కౌలు రైతు కూడా లేకుండా పోయాడు. ఏలూరు జిల్లాలో 1,60,968 మందికి రూ.107.08 కోట్లు సొమ్ములు జమవ్వగా, పశ్చిమలో 1,00,751 మందికి రూ.71.14 కోట్లు జమ చేసింది.

కౌలు రైతుకు మొండిచెయ్యి..

ఖరీఫ్ సాగు ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయింది. రైతులు నాట్లు నాటారు. కౌలు రైతులు పెట్టుబడుల కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ కౌలు కార్డుల జారీ ప్రక్రియ కూడా పూర్తి చేయలేదు. బ్యాంకుల్లో పంట రుణాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. దీంతో కౌలు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి సాయం అనేది సాగుచేసే రైతులు అందించాలి. అలా కాకుండా తొలి విడతలో భూయజమానులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం జమ చేసింది. కౌలు రైతులకు రెండో విడతలో జమ చేస్తామని చెబుతోంది. కౌలు కార్డుల ప్రక్రియ పూర్తయిన తర్వాత అన్నదాత సుఖీభవ సొమ్ములు ఇస్తామని చెబుతోంది. కార్డులు జారీ ప్రక్రియ ఎప్పటికి పూర్తి చేస్తారో, ఎప్పటికి అన్నదాత సుఖీభవ సొమ్ములిస్తారో అర్థం కాని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయాలని అంతా కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం కౌలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మేలు జరుగుతుందని కౌలు రైతులు ఆశించారు. కూటమి ప్రభుత్వం వైసిపి బాటలోనే నడుస్తోంది. కౌలు రైతులకు ఇచ్చే సొమ్ముపై ప్రభుత్వం తాత్సారం చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములిస్తారా.. ఈ ఏడాదికి ఎగనామం పెట్టేస్తారా అనే అనుమానాలు అలుముకున్నాయి. ప్రభుత్వాలు మారినా కౌలు రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రతిపక్షంలో ఉండగా కౌలురైతుల గురించి తెగ మాట్లాడిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కూడా తమను పట్టించుకోవడం లేదనే భావన కౌలురైతుల్లో వ్యక్తమవుతోంది.



భీమవరంలో..



తాడేపల్లిగూడెంలో..

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ధర్నాలు, వినతులు



తణుకులో..

ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లు మాకొద్దు.. ట్రూఅప్ ఛార్జీలు ఉపసంహరించుకోండి..అంటూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన జిల్లావాసులు విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల వద్ద, మండల కేంద్రాల్లో నినదించారు. ఎన్నికల ముందు చెప్పిందేమిటీ, చేస్తుందేమిటని గళం విప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండని చెప్పి, అధికారంలోకొచ్చాక అదానీతో ఒప్పందం రద్దు చేయకుండా అవే స్మార్ట్ మీటర్లను బిగించడం ఏం న్యాయమని నిలదీశారు. ఈ ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలకు ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు నాయకత్వం వహించగా, సిపిఎం, సిపిఐ, వామపక్షాల నేతలు సంఘీభావం తెలిపారు. భీమవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి. గోపాలన్ పాల్గొని మాట్లాడారు. తణుకులోని నరేంద్ర సెంటర్‌లో చేపట్టిన నిరసనలో ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు బి.బలరాం, కోనాల భీమారావు పాల్గొని మాట్లాడారు. తాడేపల్లిగూడెం సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. యలమంచిలిలో ర్యాలీ నిర్వహించారు. పెనుమంట్రలో నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా నాయకులు కేతా గోపాలన్ మాట్లాడగా, పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు.

వార్త 6వ పేజీలో..

అభివృద్ధిలో పాలకొల్లును అగ్రస్థానంలో నిలుపుతా

ప్రజాశక్తి - పాలకొల్లు

నియోజకవర్గంలో 952 పనులకు రూ.450 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిలో పాలకొల్లు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేలా అహర్నిశలు పని చేస్తున్నానన్నారు. తనకు ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండాగా నిర్విరామంగా పని చేస్తున్నానన్నారు. గోదావరిపై కనకాయలంక గ్రామంలో రూ.23 కోట్లతో వంతెన, ఉల్లంపర్రు వద్ద నర్సాపురం ప్రధానకాల్వపై రూ.7 కోట్లతో వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి ఈ పనులు మొదలు పెడతామన్నారు. త్వరలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. అదే ప్రాంతంలో నరసాపురం ప్రధాన కాల్వపై కాలిబాట వంతెన, బస్ షెల్టర్ నిర్మాణాలు చేపట్టామన్నారు. ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, పార్కులు, ముస్లిం షాదీఖానా, గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండపం పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఉన్నమట్ల కబర్ది, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోణం చినబాబు, పాముల రజిని కుమార్, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మామిడి శెట్టి పెద్దిరాజు, బోనం నాని, తుల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పని భారం తగ్గించాలని అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

తమకు పనిభారం తగ్గించాలని, యాప్‌ల సమస్య పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ అంగన్వాడీలపై పని భారం తగ్గించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పాత ఫోన్లు పని చేయడం లేదని, వాటిని కార్యాలయంలో అందజేశామన్నారు. కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జె.శ్యామలాకుమారి, ఎమ్‌డి.హసీనాబేగం, అనురాధ, వి.కనకమహాలక్ష్మి, జి.స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు



మురళీ సత్కరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

చదువుల్లో రాణించాలంటే విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ప్రముఖ వైద్యులు, తులసి హాస్పిటల్ అధినేత డాక్టర్ బళ్ల మురళీ అన్నారు. మంగళవారం సారవ గ్రామంలో జెడ్‌పి హైస్కూల్‌లో మురళీ ఆర్థిక సహాయంతో నిర్మించిన సైకిల్ షెడ్డును ప్రారంభించారు. అలాగే బెంచీలు బహుకరించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ చాలామంది విద్యార్థులు మేధాశక్తి ఉన్నప్పటికీ సెల్‌ఫోన్లకు బానిసలై చదువులో వెనుకబడి పోతున్నారన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ స్కూళ్ల కంటే మెరుగైన వసతులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు, ఉపాధ్యాయులు డాక్టర్ మురళీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాల నాగమణి, ఛైర్మన్ గన్నాబత్తుల వెంకటేశ్వరావు, గన్నాబత్తుల దుర్గాప్రసాద్, ఆంజనేయులు, మేడిది చిట్టిబాబు, కడలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తేనే నియోజకవర్గ అభివృద్ధి

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించి మద్దతు పలికితేనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రఘురామకృష్ణరాజును ఘనంగా సత్కరించారు. ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్.రాజు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రామరాజు తదితరులు మాట్లాడుతూ శతవసంతాల చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ పాఠశాల క్రీడా మైదానాన్ని కికెట్ గ్రౌండ్‌గా మార్చేందుకు అన్ని అనుమతులు వచ్చాయని, ఆ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్య, కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిఇఒ నారాయణరావు, టిడిపి, జనసే మండలాధ్యక్షులు కె.నాగరాజు, వెంకటేశ్వరరావు, ఉండి డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఎ ధర్మరాజుకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రం గణపవరంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఎల్ఎ ధర్మరాజుకు సిపిఎం నేతలు వినతిపత్రం అందించారు. మంగళవారం స్థానిక పంచాయతీ ఆవరణలో పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుకు సిపిఎం నేతలు ఎం.పెంటారావు, పి.నరసింహమూర్తి, కె.త్రినాథ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపవరంలో బొబ్బిలి వంతెన పున:నిర్మించాలని, వార్డుల్లో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని కోరారు. పిహెచ్‌సిని సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు బస్టాండ్, మార్కెట్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ ధర్మరాజు స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఎంఎల్ఎకు వినతి అందజేస్తున్న నేతలు

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 24 మంది నామినేషన్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మొత్తం 24 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లమిల్లి జోసెఫ్ తెలిపారు. ఈ నెల 13న జరగబోయే ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేయడానికి మంగళవారంతో గడువు ముగిసింది. అధ్యక్ష పదవికి గన్నాబత్తుల మత్స్య వల్లభరావు, బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, వైదాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పదవికి విన్నా సూర్యప్రకాష్‌రావు, గోడి సత్యనారాయణ, రొక్కాల గ్లాడ్‌స్టన్ కుమార్, జాయింట్ సెక్రటరీ పదవికి సోడదాసి శ్రీధర్, నక్కా ఆనంద్‌బాబు, లైబ్రరీ కార్యదర్శి పదవికి నారిన శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి సోడదాసి శ్రీధర్, రాయసం రాధారాణి, కోశాధికారి పదవికి పూరిళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధి పదవికి గోపిరెడ్డి మణి, కార్యవర్గ సభ్యుల పదవులకు తంగెళ్ల వెంకటేశ్వరరావు, దేవ రంజిత్‌కుమార్, కొల్లాబత్తుల చంద్రశేఖర్, బోడపాటి నారాయణస్వామినాయుడు, ఓసూరి జ్యోతి మాంగల్య, కొప్పర్తి వెంకట సుబ్రమణ్యం, పులపర్తి హర్షవర్ధన్, గోరింకల వినోద్ కుమార్, కొల్లాటి ఆదినారాయణ, కంభాల స్వర్ణ నామినేషన్లు దాఖలు చేశారని జోసెఫ్ తెలిపారు. నామినేషన్ల పరిశీలన బుధవారం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు పైడిరావు

అనేక అవార్డులు ఆయన సొంతం

ప్రజాశక్తి - పెంటపాడు


విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యం, విలువలతో కూడిన విద్యనందించడంలో కీలకపాత్ర పోషిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలువేస్తూ, పాఠశాలలో బోధనోపకారణాలు రూపొందించి వారికి అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్నారు. విద్యార్థుల మదిలో మంచి మాస్టార్‌గా, తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తూ అధికారుల చేత శభాష్ అనిపించుకుంటున్నారు. ఆయన మరెవరో కాదు పెంటపాడు మండలం జట్లపాలెం హైస్కూల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న లచ్చిరెడ్డి పైడిరావు.

1995లో ఉంగుటూరు మండలం నాచుగుంట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. కఠినమైన పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా చేసి విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధిస్తున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు వీడియో ప్రదర్శన ద్వారా పాఠాలు బోధించి విద్యార్థులతో వాటిని చేయిస్తున్నారు. కొన్ని బోధనోపకరణాలను సేకరించి పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రయోగాత్మకంగా వాటిని తయారు చేస్తున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉపాధ్యాయుడిగా రాణింపు..

1996లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్స్‌లో చీఫ్ ఇంజినీర్ ఇరిగేషన్ ఆఫీస్‌లో జూనియర్ స్టెనోగ్రాఫర్‌గా నియమితులయ్యారు. వచ్చిన జూనియర్ స్టెనోగ్రాఫర్ ఉద్యోగాన్ని వదులుకొని ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగారు. గ్రామంలో పేదరికంతో అల్లాడుతూ చదువుకోలేని వారిని చూసి చలించిపోయారు. ఎక్కడ పని చేసినా విద్యార్థులకు దాతల ద్వారా ఉచిత విద్యా సామగ్రి అందించేవారు.

బాదంపూడి ప్రయిమరీ స్కూలు, పరిమెళ్ల హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ ఉండగా వీడియో ప్రదర్శనలు చేసి విద్యార్థులకు బోధించారు. రిసోర్స్ పర్సన్‌గా 2003 నుంచి 2012 వరకూ ఉంగుటూరు మండలం మండల రిసోర్స్ పర్సన్ (ఎంఆర్‌పి)గా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎ.గోపవరం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేశారు. ప్రస్తుతం జట్లపాలెం హైస్కూల్లో పనిచేస్తున్నారు.



ఉపాధ్యాయులు పైడిరావుకు సత్కారం

పాఠశాలల అభివృద్ధికి కృషి..

గణపవరం మండలం ఎ.గోపవరంలోని ప్రాథమికోన్నత ప్రధానోపాధ్యాయులుగా పైడిరావు పనిచేసినప్పుడు సుమారు 4 లక్షల రూపాయలు దాతల విరాళంతో సర్వేపల్లి రాధాకృష్ణ, మహాత్మా గాంధీ, వాగ్దేవి విగ్రహాలు, పాఠశాల ప్రహరీ గోడ, పాఠశాల తరగతి గదులకు మెస్ నిర్మాణాలు చేపట్టారు. ఆ పాఠశాల అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ఎ.గోపవరం పాఠశాల హైస్కూల్‌గా మార్పు చెందేందుకు కృషి చేయడంతో పైడిరావును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మొక్కలు నాటడమే కాకుండా హరిత వనంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అత్యధిక అవార్డులు..

ఉపాధ్యాయులు పైడిరావు ఎన్నో అవార్డులు అందుకున్నారు. 2001లో సెన్సెస్‌లో కేంద్ర ప్రభుత్వం నుంచి సిల్వర్ మెడల్‌ను జిల్లా కలెక్టర్ జయలక్ష్మి చేతుల మీదుగా అందుకున్నారు. 2003 విన్నర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2004 సమాజ మిత్ర, లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2005 గురుదేవోభవ లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2006 సమాజ సేవిక లైఫ్‌టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2007 సేవా చక్ర లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2008 జాతిరత్న లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2009 సమాజ రత్న లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2010 ది గ్రేట్ సిటిజన్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2010లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. 2011 సేవా ఆణిముత్యం లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డు, 2012 సేవా మిత్రా లైఫ్ టైం అచీవ్‌మెంట్ స్టేట్ అవార్డులు సాధించారు. 2012లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అప్పటి జిల్లా కలెక్టర్ వాణిమోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. 2023లో ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలో తెలుగు భాషపై ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. సైన్స్ ఫెయిర్‌లో గైడ్ టీచర్‌గా మెమెంటో అందుకున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ఎన్నో ఉత్తమ అవార్డులు అందజేసి సత్కరించింది.

తొలి గురువు అక్క..

ఉపాధ్యాయులు లచ్చిరెడ్డి పైడిరావు



నా తొలి గురువు అక్క. అక్క తెర్లి సీతారామమ్మ రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్. తాడేపల్లిగూడెంలో మూడో తరగతి వరకూ ఆమె దగ్గరే విద్యాభ్యాసం చేశాను. చిన్నక్క వెంకటరమణ, అన్నయ్య ఫాల్గుణరావు ప్రోత్సాహం ఉంది. చదువు చదివించు విజ్ఞానాన్ని పెంచు అనే సూత్రాన్ని పాటిస్తాను. ఉత్తమ బోధన అందించడం, విద్యార్థులను ప్రగతి బాటలో నడిపించడం, పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దితే విజ్ఞానవంతులుగా నిలుస్తారు. విద్యార్థులు పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలనేదే నా లక్ష్యం.

బ్లీచింగ్ గొడౌన్‌లో అగ్నిప్రమాదం

రూ.5 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక మార్కెట్‌లో పులవర్తి కోటయ్యకు చెందిన బ్లీచింగ్ గొడౌన్‌లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.ఐదు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు విఆర్ఒ కెనడి తెలిపారు. అత్తిలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారని చెప్పారు. ప్రాథమికంగా రూ.5 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారని వివరించారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: టిడ్కో గృహాలు, ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక టిడ్కో గృహ సముదాయంలో ప్రత్యేక రేషన్ దుకాణాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాలనీలో తాగునీరు, శానిటేషన్, డ్రెయినేజీ నిర్మాణం తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ అన్నపూర్ణ, జనసేన నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకుడు వాడపల్లి సుబ్బరాజు, జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, ఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

45 రోజుల్లో దేగాపురం, కొమరాడ రోడ్డు పూర్తి

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని దేగాపురం నుంచి కొమరాడ రోడ్డు పనులకు మంగళవారం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.1.14 కోట్లతో నాబార్డు నిధులతో 1,350 మీటర్ల సీసీ రోడ్డు, బిటి రోడ్డు వేస్తున్నామని, 45 రోజుల్లోగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నామని, గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

ఎస్ఎస్ఎ ఎపిసి శ్యాంసుందర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి ప్రధానోపాధ్యాయుడు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ పిలుపునిచ్చారు. స్థానిక డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమైన నాలుగు రోజుల లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ పాఠశాలను సమర్ధవంతంగా నిర్వహించడానికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇది ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 215 మంది ప్రధానోపాధ్యాయులకు మొదటి విడతలో శిక్షణనిచ్చినట్లు తెలిపారు. కైవల్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీనియర్ ప్రోగ్రామ్ లీడర్ కె.శైలజ మాట్లాడుతూ ప్రతి ప్రధానోపాధ్యాయుడు మానసిక దృఢత్వానికి, ఆత్మస్థయిర్యం పెంపొందించుకోవడానికి శిక్షణ ఉపకరిస్తుందన్నారు. అనంతరం మాస్టర్ ఫెసిలిటేటర్స్ ఎం.బాలనాగమణి, పి.అనూరాధ, ఎం.శామ్యూల్‌రాజు, దాసరి ఝాన్సీ విజయకుమారి, బి.సూర్యకుమారి, టి.పోతురాజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగేశ్వరరావు, 180 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్రెయినింగ్ ప్రోగ్రామును సందర్శిస్తున్న సమగ్ర శిశు అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్


వీరవాసరంలో..


ఇరగవరంలో..


ఆకివీడులో..


పాలకోడేరులో..



ఉండిలో..

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ధర్నాలు, వినతులు


ప్రజాశక్తి - భీమవరం

ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ట్రూఅప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎలక్ట్రికల్ జెఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి జిల్లా నాయకులు చల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ప్రజలపై వేల కోట్ల భారాలు మోపే అదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వినియోగించుకున్న విద్యుత్తుకు అదనపు రుసుం ఇప్పుడు చెల్లించాలి అనడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం దారుణం అన్నారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలు ఉపసంహరించుకోకపోతే మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎఐటియుసి, టియుసిసి నాయకులు లంకా కృష్ణమూర్తి, కొల్లాబత్తుల మహంకాళి మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసి ప్రజలపై భారాలను ఉపసంహరించాలన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, లేని పక్షంలో దశల వారీ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా ఐక్య వేదిక నాయకులు బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, ఇంజేటి శ్రీను, ఎం.వైకుంఠరావు, మల్లుల సీతారాం ప్రసాద్, ఎం.ఆంజనేయులు, ఎం.రామాంజనేయులు, డి.త్రిమూర్తులు, బొక్కా సత్యనారాయణ, చల్లబోయిన వెంకటేశ్వరరావు, కలిదిండి సత్యనారాయణ, జి.జనార్ధనరావు ఆశీర్వాదం, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు : విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం, ట్రూ అప్ ఛార్జీలు పెంచడం విరమించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు బి.బలరాం, కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరేంద్ర సెంటర్‌లో ప్రజా వేదిక ఆధ్వర్యంలో, సభ్యుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. బలరాం, కోనాల భీమారావు మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలపై విపరీతంగా ఆర్థిక భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వ విధానం మార్చుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బొద్దాని నాగరాజు, సికిలే పుష్పకుమారి, పివి.ప్రతాప్, ఉద్దగిరి అజయకుమారి, గుబ్బల గోపి, పి.అమ్మి రాజు, జి.వెంకటేశ్వరరావు, ఎం.రమేష్, వల్లూరి వెంకటేశ్వరరావు, గార రంగారావు, కామన మునిస్వామి, పిఎల్.నర్సింహారావు, పి.దక్షిణామూర్తి, వివి.రాజు, శివ కుమార్, ఎస్.చిన్నారావు, అప్పన్న, నర్సింహం, అంబటి రామకృష్ణ బ్రహ్మాజీ, శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతూనే ఉన్నారని ప్రజా ఐక్య వేదిక నాయకులు బళ్ల వీరభద్రరావు విమర్శించారు. వేల్పూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇకి ఆడి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వీరభద్రరావు మాట్లాడారు. వాసా వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, దున్నే నాగేశ్వరరావు, విశ్వనాథం సుబ్బారావు, కుడకా వీరభద్రరావు, రుద్రాక్షల శ్రీనివాసు, పోలిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

వీరవాసరం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లు అడ్డుకోవాలంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు, కిలాడి సత్యనారాయణ, అయినపూడి బాబూరావు, బి.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.


వేల్పూరులో నేతల ధర్నా


ఆచంటలో..


కాళ్లలో..

గణపవరం : వినియోగదారుల నుంచి విద్యుత్ ఛార్జీల పేరుతో నిలువు దోపిడీ ఆపాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పిప్పర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. మండల కార్యదర్శి పెన్మెత్స నరసింహమూర్తి, నేతలు పి.గోవింద మాట్లాడారు. పార్టీ మండల నాయకులు ఎం.పెంటారావు, రైతు సంఘం నాయకులు గుత్తుల శ్రీను, నరాలశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

కాళ్ల : విద్యుత్ ఛార్జీల దోపిడీ ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ఐక్య వేదిక నాయకులు మాట్లాడారు. ప్రజా ఐక్య వేదిక నాయకులు మండా సూరిబాబు, తిరుమాని శ్రీను, గండికోట వెంకటేశ్వరరావు, తానుకొండ వెంకటేశ్వరరావు, తులా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండ : ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ జి.అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, గుడిమెట్ల వరహాలరెడ్డి, శీలం ఏసు, ఎం.నాగేశ్వరరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పాలకోడేరు : తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా ఐక్య వేదిక నేతలు, విద్యుత్ వినియోగదారులు డిప్యూటీ తహశీల్దార్ రఘుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు శేషాపు అయ్యప్ప మాట్లాడారు. నాయకులు దున్న మరియమ్మ, టి.వెంకన్న, సిహెచ్.రామానుదాసు, టి.రామారావు, డి.నాగరాజు, కె.గోపాల్‌రాజు, వెంకటేశ్వరరావు, పి.వెంకటస్వామి, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు సిపిఎం, సిపిఐ, ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో జయలక్ష్మి థియేటర్ ఎదురుగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆదేశాలివ్వడం దారుణమన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కొర్లి రామకృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడారు. జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, ఉల్లింగల జయకృష్ణ, అడపా లోవ, కొల్లి శివ, అయినాల సత్యనారాయణ, కుంచంగి నానాజీ, తోట శ్రీను, వెచ్చం రామారావు, ముల్లు శ్రీను, బిట్టేటి సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే జగన్నాథపురం సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి షిఫ్ట్ ఆపరేటర్ చేదురి మణికంఠకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కన్వీనర్ పాలూరి సత్యనారాయణ, మండల నాయకులు కొండేటి సోమరాజు మాట్లాడారు. నాయకులు కొండేటి రమేష్ బాబు, పీల గౌరీనాయుడు, గజ్జరపు వెంకటేశ్వరరావు, ఆర్.గణేష్, తోట వెంకటేశ్వరరావు, ఆర్.సత్యనారాయణ, ఈదర సత్యనారాయణ పాల్గొన్నారు.

యలమంచిలి : ప్రజలపై విద్యుత్తు భారాల దోపిడీని ఆపాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు పాల్గొని మాట్లాడారు. బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, మామిడిశెట్టి సుబ్బారావు, గెల్లా ఏడుకొండలు శ్రీనివాస్, బాతిరెడ్డి సుగుణ, ఎం.ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు, తెన్నేటి స్టాలిన్, పి.వెంకటస్వామి, పెద్దిరాజు పాల్గొన్నారు.

ఇరగవరం : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కామన మునిస్వామి మాట్లాడారు. ప్రజలపై ఇది పెద్ద భారమన్నారు. ఐక్య వేదిక సంఘాల నాయకులు ఇ.సత్యనారాయణ, జుత్తిగ రామాంజనేయులు, పిల్లి కోటేశ్వరరావు, దంపనబోయిన కనకేశ్వరరావు, గుత్తుల శివయ్య, కడలి ఏడుకొండలు, దిద్ది గంగయ్య, పాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం అధ్యక్షులు ఆకుల హరేరామ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూసంపుడి సుబ్బరాజు మాట్లాడారు. సిఐటియు నాయకులు కేతా గోపాలన్, నేతల చిత్రంజన్, సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్, జి.ఆంజనేయులు, ఉండ్రాజరపు భాస్కరరావు, తెన్నేటి ఆంజనేయులు, కె.నాగేశ్వరరావు, కాటిక వెంకటేష్, కర్రి సోమిరెడ్డి, మేడపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

పాలకొల్లు : స్మార్ట్ మీటర్లు బిగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాలు ధర్నా చేశాయి. ధర్నాలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు. సిఐటియు కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, గుబ్బల సత్యనారాయణ, చల్లా సోమేశ్వరరావు, పురుషోత్తం, ఇరగవరపు రాజు, కె.రామకృష్ణ, వై.అజయ్ పాల్గొన్నారు.

ఆకివీడు : స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని సిపిఎం ఏరియా కార్యదర్శి తవిటి నాయుడు తెలిపారు. ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తవిటి నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి రాంబాబు, బివి.వర్మ, బి.కళ్యాణి, గేదెల లావణ్య, బొర్రా.శ్రీను, రైస్ మిల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆచంట : స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కోరుతూ కచేరీ సెంటర్లో ధర్నా నిర్వహించి అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడారు. సిపిఎం నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, బండి రంగారావు, ఎన్.కృష్ణ, కె.సత్యనారాయణ, మన్నే బ్రహ్మయ్య, ఏడుకొండలు, మైలే నాగూర్, సురేష్ పాల్గొన్నారు.

పోడూరు : స్మార్ట్ మీటర్లు మాకొద్దని సిపిఎం పోడూరు మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడూరు విద్యుత్ కార్యాలయం వద్ద ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మాల మహానాడు మండల కార్యదర్శి బుడితి భీమారావు, సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు మాట్లాడారు. సిపిఎం సభ్యులు పిల్లి.ప్రసాద్, బురాబత్తుల వెంకట్రావు, బొంతు శ్రీను, బొంతు శంకరం, మాలమహానాడు నాయకులు తరపట్ల మోహనరావు, టి.రవికుమార్, ఎం.కృష్ణమూర్తి, కె.స్వామి పాల్గొన్నారు.

ఉండి : స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన నిరసన తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ నాగార్జునకు వినతిపత్రాన్ని అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి శేషు, ఎం సిపిఐ నాయకులు గురుగుబిల్లి రాంబాబు, నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, ఆర్.వెంకటరత్నం, ఎన్.కిషోర్, చీరాల శ్రీనివాస్, పిసుబ్రహ్మణ్యం, కడలి నాగేశ్వరరావు, విజయరామరాజు పాల్గొన్నారు.



యలమంచిలిలో..


గణపవరంలో..


పెనుమంట్రలో..



పోడూరులో..



పెనుగొండలో..

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరుగుదల

ప్రజాశక్తి - ఆచంట

పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి ఎస్.వినోద్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ వినోద్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకే కాకుండా తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా రక్షణ లభిస్తుందన్నారు. తల్లిపాలు బిడ్డకు సంజీవినిలా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.శ్యామలాంబ, డి.సూర్యకుమారి, టి.పోచమ్మ, పిహెచ్‌ఎన్. సరోజినీ పాల్గొన్నారు.

పాలకోడేరు : బిడ్డకు జన్మనిచ్చిన తల్లులు తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి సూచించారు. విసాకోడేరు సెక్టార్ పరిధిలోని గొరగనమూడి అంగన్వాడీ కేంద్రం వద్ద అంగన్వాడీ టీచర్ తాయారు ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి తల్లులకు అవగాహన కల్పించి మాట్లాడారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం : పాలకోడేరు సర్పంచి

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని పాలకోడేరు సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాల ముఖ్యోద్దేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమన్నారు. పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి, విఆర్ఒ కోటేశ్వరరావు, ఎఎన్ఎం పి.హేమలత, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు సిహెచ్ విమల కుమారి, శాంత కుమారి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా భీమవరం అర్బన్ ఏరియాలో బలిసిమూడి అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంతం ప్రారంభించి మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల రొమ్ము కేన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.అనిల్‌కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, మహాలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

కాళ్ల : తల్లి పాలు బిడ్డ ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తికి దోహదం చేస్తుందని ఐసిడిఎస్ (సిడిపిఒ) ఆకివీడు ప్రాజెక్టు అధికారి వి.వాణి విజయరత్నం అన్నారు. మంగళవారం పల్లిపాలెంలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు వి.కృష్ణకుమారి, పి.తులసి మాట్లాడుతూ బిడ్డకు 6 నెలల వరకూ తల్లిపాలు మాత్రమే అందించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచి పి.శకుంతల, ఎంపిటిసి పి.లీలావతి, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

యలమంచిలి: మండలంలోని యలమంచిలి, చించినాడ గ్రామాల్లో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా యలమంచిలి పిహెచ్‌సి డాక్టర్ సతీష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎంఎన్.పద్మావతి హాజరై మాట్లాడారు. బిడ్డకు 6 నెలల వరకూ తల్లిపాలు మాత్రమే అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం దుర్గాభవాని, ఎంఎల్‌హెచ్‌పి ఎన్.శాంతి, అంగన్వాడీలు బి.రజిని, ఎన్.సుజాత, జి.సత్యజ్యోతి, ఆశాలు ఆదిలక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి తడి, పొడి చెత్త వేరు చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గోపి మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య నిర్మూలనకు పెద్దపేట వేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నామని, దీని ద్వారా వర్మీ తయారుచేసి పంచాయతీకి ఆదాయాన్ని సమకూరుస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, విఆర్ఒ కోటేశ్వరరావు, మాజీ సర్పంచి ఏడుకొండలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పౌర సేవలు సులభతరం : మండల ప్రత్యేకాధికారి నాగ లింగాచారి

ప్రభుత్వం ఇకనుంచి పౌర సేవలను సులభతరం చేసిందని దీనిలో భాగంగా మన మిత్ర (వాట్సప్ గవర్నెన్స్) అమల్లోకి తీసుకొచ్చిందని మండల ప్రత్యేకాధికారి నాగలింగాచారి అన్నారు. పాలకోడేరులో వాట్సప్ గవర్నెన్స్‌పై మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌర సేవలపై అవగాహన కల్పించారు. నాగలింగాచారి మాట్లాడుతూ వివిధ పౌర సేవలను సులభంగా సమర్థవంతంగా అందించడమే దీని లక్ష్యం అన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రఘు, పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి, విఆర్ఒ కోటేశ్వరరావు, కృష్ణ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ప్రతి పౌరుడూ శానిటేషన్ సిబ్బందికి సహకరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురాన్ని క్లీన్ పట్టణంగా రూపొందించేలా ప్రతి పౌరుడూ శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య కోరారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ మేస్త్రీ, శానిటరీ సెక్రటరీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డుపై, డ్రెయిన్‌లో చెత్త వేయకుండా చూడాలని కోరారు. శానిటేషన్ సిబ్బంది అంతా అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం పలు వార్డుల్లో ప్రజల సమస్యలను పరిశీలించారు.

కాళ్ల ఎంఇఒగా-1గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేస్తానని కాళ్ల ఎంఇఒ -1 దొమ్మేటి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఉండి మండలం యండగండి హైస్కూల్లోస్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. పూర్తి అదనపు బాధ్యతలతో కాళ్ల ఎంఇఒ-1గా శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంఇఒ-1గా బాధ్యతలు స్వీకరించినందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది మోహన్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఇ-గవర్నెన్స్ యాప్ పట్ల అవగాహనుండాలి

పెనుమంట్ర: మహిళలు, పిల్లల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ గవర్నెన్స్ యాప్ పట్ల అవగాహన కలిగి ఉండాలని పెనుమంట్ర ఇఒపిఆర్‌డి వల్లభు రాంబాబు అన్నారు. మంగళవారం నెగ్గిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద ఈ గవర్నన్స్ అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ గ్రామంలోని పలు వీధుల్లో సాగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి, ఉపసర్పంచి అల్లం సాయిరెడ్డి, ఎంపిటిసి పెనుగొండ లక్ష్మి, సెక్రటరీ గుత్తికొండ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : రాష్ట్ర ప్రభుత్వం విన్నూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు మంగళవారం జల్లికొమ్మరలో ఏర్పాటు చేసిన వాట్సప్ గవర్నన్స్ సేవలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువకావాలన్నదే ముఖ్యోద్దేశమన్నారు. అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

నరసాపురం: వైఎస్‌పాలెంలో వాట్సప్ గవర్నెన్స్ పై మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ అధ్యక్షతన నిర్వహించిన ర్యాలీలో ఆర్‌డిఒ దాసిరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు అందరూ ఈ సేవలు వినియోగించుకోవడం అలవర్చుకోవాలన్నారు. తహశీల్దార్ సత్యనారాయణ, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, విఆర్ఒ చిరంజీవి, సెక్రటరీ డి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర అజరామరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని, సమర యోధుల చరిత్ర అజరామరమని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. క్విట్ ఇండియా స్థూపం కమిటీ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాల బ్రోచర్‌ను మంగళవారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అటువంటి అమర వీరుల చరిత్రను భావితరాలకు తెలియజేయడానికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పక్షోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పక్షోత్సవ కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడారు.